క్లుప్తంగా

ఆలయంలో ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో గల శివలింగానికి అర్చకులు పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. మొదట మహాగణపతికి పంచామృతాలతో అభిషేకం చేసి అనంతరం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, వివిధ రకాల పూజ ద్రవ్యాలతో అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా పూజలు జరిపించారు. ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ఆలయంలోని శివలింగానికి పాలాభిషేకం చేస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

రెడ్డిసేవా విద్యా ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



వీపనగండ్ల: మండలంలోని పుల్గరచర్ల మాజీ సర్పంచ్ ఎద్దుల వెంకట్‌రెడ్డి తన భార్య నారాయణమ్మ జ్ఞాపకార్థం రెడ్డిసేవా సమితి విద్యా ట్రస్ట్ కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆర్థికంగా వెనకబడిన కుటుంబాల విద్యార్థులకు ఈ డబ్బులు ఉపయోగపడతాయన్న సదుద్దేశంతో సేవా సమితి సభ్యులకు విరాళం అందజేస్తున్నట్లు దాత వెంకట్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా శ్రీజానకమ్మ వారి రథోత్సవం



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో వెలిసిన శ్రీజానకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద పూలు, విద్యుత్ దీపాలతో రథోత్సవాన్ని అందంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఆరాధన తదితర పూజలు నిర్వహించిన పండితులు మధ్య రాత్రి సమయంలో భక్తులు రథోత్సవాన్ని అమ్మవారి నామస్మరణ చేస్తూ లాగారు. సోమవారం అమ్మవారి తీర్థావళి తదితర పూజలు నిర్వహించారు. ఈ నెల 11న ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు సోమవారంతో ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పెన్నులు పంపిణీ



పెబ్బేరు రూరల్: అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి పట్టణంలోని చాణక్య పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ పెన్నులు ఇస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యంగా పరీక్షలు రాసి మీ భవిష్యత్‌ను నిర్మించుకోవాలన్నారు. పరీక్ష సెంటర్ల వద్ద విద్యార్థులకు ఫిల్టర్ వాటర్ అందుబాటులో ఉంచాలని, వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు.

విద్యార్థులకు చెక్కుల అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (వీపనగండ్ల)కు చెందిన విద్యార్థులు బి.గౌతమ్, అఖిల్‌కృష్ణ గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల 'ఇగ్నైట్ ఫెస్ట్–2024'లో భాగంగా చిత్రకళా పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జూనియర్ విభాగంలో బి.గౌతమ్ (7వ తరగతి) మొదటి బహుమతి కింద రూ.10వేలు, సీనియర్ విభాగంలో అఖిల్‌కృష్ణ తృతీయ బహుమతి కింద రూ.5వేలు సాధించారు. ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు సంబంధించిన చెక్కులను ప్రిన్సిపాల్ దయాకర్, ఆర్ట్ టీచర్ నరేందర్‌లు అందజేశారు.



పాన్‌గల్‌లో..



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్‌లో..

'పది' పరీక్షలు ప్రారంభం

ఆత్మకూర్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆత్మకూర్‌లో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. బాలికల ఉన్నతపాఠశాలలో 189 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 177 మంది, కాలేజీ హైస్కూల్‌లో 230 మంది కలిపి 596 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 595 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.

అమరచింత: స్థానిక డీఎంఆర్‌ఎం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 126 మంది, జెడ్పీ ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటెండెంట్లు అనంతరాం, శ్రీనివాస్, డీఓలుగా రాఘవేందర్, రాజేంద్రప్రసాద్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఎస్‌ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 143 మంది కలిపి మొత్తం 363 మంది విద్యార్థులకు గాను వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాష, సురేష్, డిపార్టుమెంటల్ అధికారులు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎస్‌ఐ వేణు, ఎంపీఓ రఘురాములు సందర్శించారు.



గోపాల్‌పేట పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌కు మొత్తం 230 మంది విద్యార్థులను కేటాయించగా 100 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌కు 235 మందిని కేటాయించగా 234 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈఓ ఉషారాణి తెలిపారు. స్క్వాడ్ లక్ష్మణ్‌నాయక్, తహసీల్దార్ పాండునాయక్, ఎంపీఓ రాజు, ఎంఈఓ ఉషారాణి, ఆర్‌ఐ గణేష్ రెండు సెంటర్లలో తిరిగి ఏర్పాట్లను పరిశీలించారు.



పాన్‌గల్‌లో..

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర, బాలికల) రెండు సెంటర్లలో కలిసి మొత్తం 409 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 404 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో 175 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిపార్ట్‌మెంటల్ అధికారి గోవింద్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ వరలక్ష్మి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గోపాల్‌పేట: మండల కేంద్రంలో సోమవారం ఒక్క రోజే మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎదుట ముగ్గురు యువకులు ద్విచక్రవాహనం ఆపి మాట్లాడుకుంటున్నారు. వనపర్తికి చెందిన బోయ నాగరాజు బైక్‌పై పోలీస్ స్టేషన్ వైపు నుంచి బస్టాండు వైపు వెళుతూ వెనకాల నుంచి గ్రోమోర్ ఎదుట నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి కిందపడిపోయాడు. దీంతో రవి అనే యువకుడి కాలుకు గాయం కాగా బోయ నాగరాజు తలకు, మోచేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న రిపోర్టర్లు గాయపడిన వారిని కానిస్టేబుల్ అంజి సాయంతో గోపాల్‌పేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం వనపర్తి ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బస్టాండు వైపు నుంచి పెద్ద యాదగిరి ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట ద్విచక్ర వాహనం నిలుపుతుండగా వెనకాల నుంచి మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో పెద్దయాదగిరి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

సేవాలాల్ విగ్రహం తొలగించడం సరికాదు

కోడేరు: మండలంలోని ఎత్తం గట్టు దగ్గర ఏర్పాటు చేసిన సేవాలాల్ విగ్రహాన్ని ఫారెస్టు అధికారులు సమాచారం ఇవ్వకుండా విగ్రహాన్ని తొలగించడం సరికాదని గిరిజన సంఘం నాయకులు భీముడునాయక్, రాజేష్‌నాయక్, శ్రీరాములునాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని తొలగించి గిరిజనుల మనోభావాలను దెబ్బతీశారని వాపోయారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సూగూరులో పోషణ పక్షం వారోత్సవాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పౌష్టికాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ భారతిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ రాణి అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని పదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

పాన్‌గల్: పోషక పదార్థాలను భోజనంలో తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీడీఓ కోటేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహిన్‌బేగం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ వేడుకలు నిర్వహించారు.

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిధిలో బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని సూగూరులో అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన చిరుధాన్యాలతో కూడిన పోషక పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణి, శ్యామల, సావిత్రి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: తూముకుంటలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం చిన్నారులకు అన్నప్రాసన చేయించారు.

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో అంగన్‌వాడీ కేంద్రం–1లో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా సోమవారం చిన్నారులకు అన్నప్రాసన చేయించినట్లు అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ హెల్పర్ మన్నెమ్మ తదితరులు ఉన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే మండలంలో కొనసాగుతుంది. సోమవారం మండల కేంద్రంతో పాటు చిక్కేపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు. శరీరంపై మొద్దుబారిన స్పర్శలేని మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని, రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు తెమడ, రక్తం పడటం, స్వల్పకాలంలో బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో రోజు విడిచి రోజు జ్వరం రావడం, రాత్రి వేళలలో చెమటలు పట్టడం వంటి లక్షణాలు టీబీ వ్యాధి లక్షణాలు అని వివరించారు. ఈ లక్షణాలు ఉన్న వారు వైద్యాధికారిని సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించారు.

పరిశుభ్రత పాటించాలి

అమరచింత: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా బ్యాక్టీరియాలు శరీరంలోకి చేరకుండా కాపాడుకునే అవకాశం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద అన్నారు. మండలం కేంద్రంలోని ఆరో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణబీ, పాడాయిబీ అనే కార్యక్రమంతో పాటు హ్యాండ్‌వాష్ కార్యక్రమం నిర్వహించి కాలనీలోని మహిళలకు అవగాహన కల్పించారు. చేతులకు సబ్బునీటితో కడుక్కోవాలని, మలమూత్ర విసర్జనకు వెళ్లిన ప్రతిసారి కాళ్లు, చేతులు నీటితో కడుక్కోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన గోపి అనే యువకుడిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని అమ్మాయి, అదే గ్రామానికి చెందిన గోపి ప్రేమించుకున్నారు. అమ్మాయి పెళ్లి చేసుకోమని అడుగగా దాటవేస్తూ వచ్చాడు. అనంతరం అతడు పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్



వనపర్తిలో కౌన్సిలర్ అక్కమ్మకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 2 వార్డు కౌన్సిలర్ అక్కమ్మ సోమవారం వనపర్తిలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక నాయకుల సమక్షంలో ఆమెకు ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో చురుకుగా పనిచేశానని, కౌన్సిలర్‌గా గెలుపొందిన నాటి నుంచి నేటి వరకు కేవలం పదవి మాత్రమే అనుభవిస్తున్నానని, ఎలాంటి గౌరవం దక్కలేదని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షించి కాంగ్రెస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రంజిత్‌కుమార్, భానుప్రకాష్‌రెడ్డి, గంధం రాజశేఖర్, దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

మైనార్టీ సెల్ కమిటీ ఎన్నిక

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, మైనార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు లతీఫ్, ముజీబ్, గఫార్, ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో కొత్తకోట పట్టణ మైనార్టీ సెల్ కమిటీని నూతనంగా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎండీ ఎజాస్‌అలీ, ఉపాధ్యక్షులుగా మహబూబ్‌అలీ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఖైసర్‌తో పాటు అబ్దుల్ ఖయ్యూం, మహమ్మద్ నయూం, అంజద్, మహ్మద్ నజీమ్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని సభ్యులను పలువురు కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో అజహార్‌అలీ, మహ్మద్ రషీద్ తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: ప్రస్తుత తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ కొందరు అమాయకుల నుంచి రూ.లక్షలు దోచుకుంటున్నారని, అలాంటి సైబర్ నేరగాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సైబర్ నేరాలపై యువకులకు అవగాహన కల్పించారు. ఉచితంగా ఎవరూ డబ్బులు ఇవ్వరని, అలాంటిది సెల్‌ఫోన్లలో మీకు పరిచయం లేని వ్యక్తులు బహుమతులు వచ్చాయని, నగదును గెలుచుకున్నారని తప్పుడు సమాచారం అందిస్తూ మీ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలను హ్యాకింగ్ చేస్తు డబ్బులు కొట్టేస్తున్నారని తెలిపారు. ఆధార్ అప్‌లోడ్ చేస్తామని, బ్యాంక్ నుంచి అని, ఏటీఎం పిన్ అప్‌డేట్, మొబైల్ నంబర్ తప్పుగా ఉందని ఇలా రకరకాలుగా మాట్లాడుతూ మోసం చేస్తుంటారని వివరించారు. ఇలాంటి వాటిని నమ్మొద్దని, ఫేక్ కాల్స్‌పై తమకు వెంటనే సమాచారం అదించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

నేడు బీడీ కార్మికుల చలో చిన్నచింతకుంట

అమరచింత: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీడీ కార్మికులకు బీడీ కూలి పెంచాలని డిమాండ్ చేస్తు మంగళవారం చలో చిన్నచింతకుంట కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీడీఅండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎస్ రమేష్, బుచ్చన్న తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం బీడీ కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి బీడీ కూలి పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించే కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. అమరచింతలో 4 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారని వీరిలో కేవలం 4 వందల మందికి మాత్రమే జీవన భృతి అందుతున్నదన్నారు. ప్రతి బీడీ కార్మికుడికి జీవన భృతి అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, విజయ్ , ప్రకాశం, నిశాంత్, వెంకటన్న, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 4వ వార్డు నర్సింగాయపల్లిలో అనారోగ్యంతో మరణించిన అలివేల, 8వ వార్డు శ్రీనివాసపురంలో మృతి చెందిన కృష్ణయ్య కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కాకుల సతీష్, చీర్ల చందర్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, విభూది నారాయణ, నాయకులు ద్యారపోగు వెంకటేష్, ఉమ్మల రాములు బొంబాయి మన్నెంకొండ, మసూర్ ఆలీ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని బహదూర్‌గూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మినిగె శంకరయ్య కుటుంబానికి సోమవారం కాంగ్రెస్ నాయకులు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్యంతో మృతిచెందిన విషయాన్ని మండల కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకవెళ్లడంతో ఆయన స్పందించి పంపించిన ఆర్థికసాయం నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, దర్గయ్య, రాజయ్య, స్వామి, బాలపీరు, రాజు పాల్గొన్నారు.



బహదూర్‌గూడెంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

పాన్‌గల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలంగాణ ఓటరు సంకల్ప పత్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా.. కులం, మతం, ప్రాంతం, భాష, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసేలా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబం, ఇరుగు పొరుగు వాళ్లు, ఇతర పరిచయస్తులు, స్నేహితులు అందరూ ఓటు వేసేలాగా ప్రోత్సహిస్తామని, వందశాతం పోలింగ్‌లో భాగస్వామ్యం అవుతామని సంకల్ప పత్రం సమర్పిస్తున్నామని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు ఓటరు సంకల్ప పత్రాలను అందజేశారు.



ఓటరు సంకల్ప పత్రంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మహిళా చట్టాలపై అవగాహన తప్పనిసరి

పాన్‌గల్: మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని దావాజిపల్లిలో ఎన్ఆర్‌ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాంబాబు హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వలన ఎదురయ్యే పరిణామాలు, అసాధారణ పిల్లల జననాలను నిరోధించడానికి గల అంశంపై అధిక ప్రమాదకర గర్భాల నివారించుట గురించి, పోషకాహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య యొక్క ప్రాముఖ్యత వేసవి కాలంలో పిల్లల సంరక్షణ గురించి వివరించారు. బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆన్‌లైన్, సైబర్ మోసాలు, పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నివారణ, మంచి, చెడు స్పర్శ అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 112, 181, 100పై అవగాహన కల్పించారు. ఉపాధి కూలీలతో పిల్లల రక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి నరేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రాజేష్‌కుమార్, ఫీల్డు అసిస్టెంట్ గోపాల్‌గౌడు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



దావాజిపల్లిలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న బాలల పరిరక్షణ సభ్యులు

గోపాల్‌పేట: మండల కేంద్రానికి సమీపంలో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు జిల్లా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా చట్టాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, బాలికల రక్షణ వంటి చట్టాలపై ఉపాధి హామీ కూలీలకు వివరించారు. మహిళలు, బాలబాలికలు ఎటువంటి ఇబ్బందులకు గురైనా 181 నంబరుకు సమాచారం అందిస్తే వెంటనే స్పందించి వారికి రక్షణ కల్పిస్తారని చెప్పారు. పాఠశాలలో పిల్లలకు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే గట్టిగా అరవమని, లేదా ఆ స్థలం నుంచి వెళ్లిపోవాలని సూచించారు. బడి మానిపించడం, బాల్య వివాహం చేయడం వంటివి చేస్తే 1098 నంబరుకు ఫోన్‌కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్, జెండర్ స్పెషలిస్టు శ్రీవాణి, సలోమి, సుమ, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో..